# అపోహ

రచన:
శ్రీ కోపల్లె రామారావు.

ప్రియమయిన విద్యార్థినీ విద్యార్థులారా,

నేను ఒక ముఖ్య విషయము చెప్పటం కోసం, ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశాను. మన హైస్కూలులో అనేకమంది బీద విద్యార్థులు చదువుకుంటున్నారనే విషయం మీకందరకు తెలుసు. వారిలో చాలామంది బాగా చదివి మంచి మార్కులుగూడా తెచ్చుకుంటున్నారనే విషయంకూడా మీకందరకూ తెలుసు. బీదవారయి ఉండి మంచి మార్కులు వచ్చిన వారికి ప్రభుత్వంవారు స్కాలర్‌షిప్పులు ఇచ్చి సహాయపడుచున్నారు. కానీ మనదేశ సరిహద్దులలో చైనా, పాకిస్థాన్‌లు దండయాత్రలు చేయడానికి కుతంత్రాలు పన్నుచుండుటచేత రక్షణ వ్యయాన్ని పెంచటముకొఱకు ఈ స్కాలరుషిప్పుల ధనాన్ని వినియోగించడం తప్పనిసరి అయింది. ఆ స్కాలరుషిప్పులపై ఆధారపడి చదువుకుంటున్నవారికి ఇది విద్యుద్ఘాతం. కొంతమంది ఇందువలన చదువు ఆపడం తప్పనిసరి అవుతుంది. వారి భవిష్యత్తు నాశనమవుతుంది. కాబట్టి మీకందరకూ నా విజ్ఞప్తి యేమంటే ధనిక విద్యార్థులందరూ ప్రతి నెలా కొంత సొమ్ము విరాళంగా ఇస్తే, మరి కొంత మా ఉపాధ్యాయులము వేసి బీద విద్యార్థులకు జీతం కట్టి వారి విద్యాభ్యాసం కుంటుపడకుండా చేయవచ్చు. ఈవిధంగా మీ సహచర విద్యార్థులకు తద్వారా దేశానికి సహాయపడమని విజ్ఞప్తి చేస్తున్నాను.

అని ఉపన్యసించారు ప్రధానోపాధ్యాయులు విశ్వనాథంగారు. విద్యార్థులంతా కరతాళ ధ్వనులు చేశారు. ఇంతలో మళ్ళీ హెడ్ మాస్టర్‌గారన్నారు. ఇప్పుడు దగ్గరున్నవారు యివ్వవచ్చు. లేనివారు ఎంత యివ్వగలరో వాగ్దానంచేసి రెండు రోజులలో తెచ్చియివ్వండి అని ముగించారు. నలుగురైదుగురు విద్యార్థులప్పుడే యిచ్చారు. కొంతమంది వారెంత ఇవ్వదల్చుకున్నారో వాగ్ధానం చేస్తున్నారు. మాస్టారూ నేను 10 రూపాయలిస్తాను అని వాగ్దానం చేశాడు రవీంద్ర.

పిల్లలేగాక ఉపాధ్యాయులు సైతం ఆశ్చర్యపోయారు. మంచి బట్టలులేక చినిగినవే అనేక కుట్లు కుట్టి ధరించే రవీంద్ర పది రూపాయలు విరాళం ఇస్తాడా? ఎలా ఇవ్వగలడని కొందరు. కేవలం పదిమందిలో గొప్పకోసమే అలా అన్నాడని ఇవ్వడని మరికొందరూ, తలకొక రకంగా భావిస్తూ క్లాసులలోనికి వెళ్ళారు.

రవీంద్ర ఒక జిల్లా పరిషత్ హైస్కూలులో S. S. L. C. చదువుచున్న బీద విద్యార్థి. తండ్రి లేడు. తల్లి ధనికుల యిండ్లలో వంట చేసి తన పొట్టపోసుకుంటూ రవీంద్రని చదివిస్తున్నది. తల్లి కష్టమును చూస్తున్న రవీంద్ర శ్రద్ధగా చదువుతూ ప్రతిసారీ మంచి మార్కులు తెచ్చుకుంటూ ఉపాధ్యాయుల మన్ననలకు పాత్రుడయ్యాడు. బట్టలన్నీ చినిగిపోయినందున బట్టలు కొని కుట్టించుకోమని పది రూపాయలు ఇచ్చింది తల్లి రవీంద్రకు. కానీ హెడ్‌మాస్టరుగారి ఉపన్యాసం విన్న రవీంద్ర పదిమంది బీద విద్యార్థులకు తోడ్పడమే ముఖ్యంగాని తనకు బట్టలు ముఖ్యంగాదని తలచాడు.

మర్నాడు తను వాగ్దానం చేసినరీతిగా పది రూపాయలు తీసుకువెళ్ళి విశ్వనాథంగారికిచ్చి నమస్కరించాడు, శభాష్ రవీంద్ర. నీవంటి

విద్యార్థులు పదిమంది వుంటే స్కూలు అభివృద్ధిలోకి వస్తుంది అన్నారు ఆయన. గర్వంగా తన క్లాసులోనికి వెళ్ళాడు రవీంద్ర.

ఇంతలో రవీంద్ర ప్రక్కనే కూర్చున్న సబ్ కలక్టరు రంగస్వామిగారి కుమారుడు విశ్వం హెడ్ మాస్టరుగారి దగ్గరకు వెళ్ళి తన జేబులోని పది రూపాయల నోటు ఎవరో కాజేశారని రిపోర్టు చేశాడు. నీకెవ్వరిమీదనయినా అనుమానం ఉన్నదా అని ప్రశ్నించారు ఆయన.

అతనికి రవీంద్ర గుర్తుకొచ్చాడు. రవీంద్రకు మంచి మార్కులు రావటం గిట్టదు అతనికి. వెంటనే రవీంద్రపై అనుమానం ఉన్నదని చెప్పాడు.

అప్పుడే రవీంద్ర పది రూపాయలు కాగితమిచ్చి వెళ్ళటము, విశ్వం అతనిపై రిపోర్టు చెయ్యడమునుబట్టి ఒకవేళ రవీంద్ర తన గౌరవం నిలబెట్టుకోవడంకోసం దొంగిలించాడేమోనని అనుమానం గలిగింది విశ్వనాథంగారికి. వెంటనే రవీంద్రని పిలిపించి అడిగారు. నాకేపాపము తెలియదు. మా అమ్మ బట్టలు కుట్టించుకోమని ఇచ్చిన డబ్బు మీకిచ్చానని ఎంతగా చెప్పినా నమ్మలేదు. ఇటువంటి తప్పుడుపని చేసినందుకు పదిరోజులు స్కూలులోనుంచి సస్పెండు చేస్తున్నాను. ఫో అని గర్జించారు. కళ్ళమ్మట కన్నీరు ధారగా కారుచుండగా బయటకు వెళ్ళిపోయాడు రవీంద్ర.

ఇంతలో మంచినీళ్ళు త్రాగటానికి పంపు దగ్గరకు వెళ్ళిన ఒక కుఱ్ఱవానికి పంపుకు పది గజాల దూరంలో పడిఉన్న ఒక క్రొత్త పది రూపాయల కాగితం దొరికింది. వెంటనే అతను ఆ కాగితం తీసుకువెళ్ళి విశ్వనాథంగారికిచ్చి దొరికిన చోటు చెప్పాడు. ఆయన తన తొందరపాటుకు చింతిస్తూ రవీంద్రని పిలుచుకురమ్మని ఒక బంట్రోతును పంపి, విశ్వాన్ని పిలిపించారు. విశ్వం రాగానే కోపంగా ఇలా అన్నారు. విశ్వం నీవు అజాగ్రత్తగా నీ పది రూపాయలు కాగితాన్ని పంపువద్ద పారేసుకొని, సరిగా చూచుకోకుండా రవీంద్రపై పిర్యాదు చేశావు. ఆరేళ్ళనుంచి ఒక్క చెడు నడతలేని రవీంద్రని నేను నిర్మూలంగా అనుమానించి అతని మనస్సు బాధపెట్టాను. అతనిపై అపోహపడ్డాను. అని అంటుండగా రవీంద్రని తీసుకొచ్చాడు బంట్రోతు. నన్ను క్షమించు రవీంద్రా అని అన్నాడు విశ్వం.



Manufacturing ¼ H.P. 20 H.P,—3 Phase RPM Motors 960, 1450 & 2890 Monoblock set 2 H.P. to 20 H.P.3 Phase HP. to 2 H.P

*Dealers in Madras City:*—UNITED AGENCIES
96, Arminian Street, Madras-1.
POPULAR ELECTRICALS,
329, Thambu Chetty St , Madras-1

Sole Agents for Eastwhile Hyderabad & Maharashtra State, M/s. Vijai, Agencies 24, Market Road, Secundarabad-3.

*Agents for Cuddappah Dt:*—
M/S. V. S REDDY & CO.,
4/192, Dr. Ayyaswami Pillai St.,
Cuddapah (A.P.)